సాక్షి చిత్తూరు

శనివారం। 16। ఆగస్టు। 2025



నేటి నుంచి రాజనాలబండ జాతర

నేటి నుంచి రెండు రోజుల పాటూ రాజనాలబండ జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



బోయకొండలో రాహుకాల పూజలు

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా బోయకొండలో గంగమ్మకు రాహుకాల పూజలు నిర్వహించారు. - 8లో



అరాచకం రాజ్యమేలుతోంది

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79ఏళ్లు అవుతోందని అయితే రాష్ట్రం స్వాతంత్య్రం కోల్పోయి ఏడాదన్నర అవుతోందని భూమన అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో ప్రథమ చికిత్స కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు లీగల్ : చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రథమ చికిత్స కేంద్రాన్ని జిల్లా జడ్జి అరుణసారిక ప్రారంభించారు. కక్షిదారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు.. ఎవ్వరైనా సరే ప్రథమ చికిత్స అవసరమైనప్పుడు ఇక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని జిల్లా జడ్జి తెలిపారు. న్యాయస్థానాలు పనిచేసే రోజుల్లో ప్రథమ చికిత్స కేంద్రం కూడా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతారన్నారు. అధికారులు సమాచారంతో రావాలని కోరారు.

కాణిపాకం..జనసందడి



రద్దీగా క్యూలైను

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం శుక్రవారం భక్తజన సందడితో రద్దీగా మారింది. ఉచిత దర్శనం మొదలు శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శనం వరకు భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. మూడు రోజుల పాటు సెలవులు కావడంతో ఆలయం భక్త జనులతో కిటకిటలాడింది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. శని, ఆదివారాల్లో ఆలయానికి భక్తుల తాకిడి మరింత అధికంగా ఉంటోందని ఆలయ అధికారులు చెబుతున్నారు.

వాణ్యిసముదాయానికి వేలంపాటతో ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వెదురుకుప్పం : మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయానికి అధికారులు ఎట్టకేలకు వేలంపాట నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెదురుకుప్పం పంచాయతీని వ్యాపారపరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూనుకున్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో మాట్లాడి రూ.50 లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేయించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు, కాంట్రాక్టర్ రామయ్య 11 గదులు నిర్మించి పూర్తి చేశారు. అప్పట్లోనే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రారంభోత్సవం చేసేశారు. అయితే వేలం పాట సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఇదే సమయంలో ప్రభుత్వం మారడంతో టీడీపీ నాయకుల పెత్తనం ఎక్కువైంది. స్థానిక సర్పంచ్ శిల్ప వేలం పాటకు నోటీస్ అందించి తేదీ నిర్ణయించినా టీడీపీ నేతలు అధికారులను బెదిరించి జరపకుండా అడ్డుకున్నారు. ఈక్రమంలో వేలం పాట నిర్వహించాలంటూ రామయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో అధికారులు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. 11 గదుల కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌ను వేలం వేయగా నెలకు రూ. 65,500, 10 గదుల పాత కాంప్లెక్స్ గదుల వేలం ద్వారా నెలకు రూ. 28,300 వచ్చినట్లు కార్యదర్శి కోదండరామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా వారపు సంత వేలం ద్వారా సంవత్సరానికి రూ. 1,81,500 వచ్చిందన్నారు. మొత్తానికి అన్ని విధాలా సంవత్సరానికి రూ. 13,07,100 ఆదాయం పంచాయతీకి వచ్చిందన్నారు. వేలం పాటలో ఎంపీడీఓ పురుషోత్తం, సర్పంచ్ శిల్ప, డిప్యూటీ ఎంపీడీఓ బాలసుబ్రమణ్యం, కార్యదర్శి కోదండరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులు టీసీ రాజన్‌ను సత్కరించిన మంత్రి , ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి , కలెక్టర్



త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ నృత్యం చేస్తున్న విద్యార్థులు



మదినిండా.. మన జెండా

జిల్లాలో 79వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకం రెపరెలాడింది. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలుతో వివిధ శాఖల అధికారులతో కలిసి జెండావిష్కరణ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాగ్ షో అలరించింది. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

మురిసిన మువ్వన్నెల రెపరెపలు

- పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 79వ స్వాతంత్య్ర వేడుకలు
- స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిల్చిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పతాకావిష్కరణ చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
- ఉత్తమ సేవలందించిన 319 మందికి ప్రశంసాపత్రాలు
- ఆకట్టుకున్న పోలీసు జాగిలాల విన్యాసాలు



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



జెండా వందనం చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : రోగుల వైద్య రికార్డులను ఆసుపత్రులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేసే తొలి డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు.

డిజిటల్ నెర్వ్ సెంటర్లు

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్ట్‌గా కుప్పంలో నిర్వహిస్తున్న డిజిటల్ నెర్వ్ సెంటర్లను త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం కుప్పంలో ఏర్పాటు చేసిన నెర్వ్ సెంటర్ పరిధిలోకి 13 వైద్య ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేశామన్నారు. దీంతో పాటు ఆయుష్మాన్ భారత్, ఎన్‌టీఆర్ వైద్య సేవలను సమన్వయం చేస్తూ వ్యక్తుల హెల్త్ హిస్టరీని డిజిటలైజ్ చేయడంతో పాటు రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకంలో రూ.5 లక్షలు వార్షిక ఆదాయం లోపు ఉన్న ప్రతి వ్యక్తికి వెయ్యి రూపాయల ఖర్చు పైబడి ఉన్న 3255 జబ్బులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తున్నామని మంత్రి చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 47,725 మందికి రూ.91 కోట్లు, ఆరోగ్య ఆసరాలో 15,711 మందికి రూ.7.80 కోట్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలుగా భావించి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జిల్లాలో పల్లెపండుగలో ఇప్పటి వరకు రూ.85 కోట్లతో పనులు ప్రారంభించామని, ఇందుకు 1454 రోడ్లు పూర్తి కాగా, రూ.19 కోట్ల తో ప్రారంభించిన 33 బీటీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. స్వామిత్రా డ్రోన్ టెక్నాలజీ జిల్లాలోని 781 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామన్నారు. జిల్లాలో 72,763 గృహాలకు ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున రూ.1350 కోట్లతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు చేస్తున్నామన్నారు.

ఉప్పొంగిన దేశభక్తి

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తి ఉప్పొంగేలా సాగాయి. వైఎస్సార్ కడపకు చెందిన జయచంద్ర అకాడమీ నిర్వహించిన కళారిపట్టు నృత్యం ఆకట్టుకుంది. తిరుపతి జిల్లా ఎస్వీ యూనివర్శిటీకి చెందిన విద్యార్థినులు నిర్వహించిన రాణి ఆఫ్ ఝాన్సీ ప్రదర్శన అలరించింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విజయం విద్యా సంస్థల విద్యార్థులకు మొదటి బహుమతి, ఏపీ ట్రైబల్ గురుకుల పాఠశాల విద్యార్థులకు రెండో బహుమతులను మంత్రి సత్యకుమార్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అందజేశారు. శకటాల ప్రదర్శనలో వ్యవసాయ శాఖ మొదటి బహుమతి, విద్యాశాఖ శకటం రెండవ బహుమతి కైవసం చేసుకుంది. కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ, టీచర్లు పాల్గొన్నారు.

స్టాల్స్ ప్రదర్శన: స్టాల్స్ ఏర్పాటులో హార్టికల్చర్ శాఖ మొదటి బహుమతి, పట్టుపరిశ్రమ శాఖ రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్ తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర వేడుకల్లో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పీఎం మాతృవందన యోజన

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలోని 32 మండలాల్లో 44 చంద్రన్న సంచార రథాలతో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. జిల్లాలో 2,23,201 మంది విద్యార్థులకు సంబంధించి రూ.335 కోట్లు తల్లుల ఖాతాలకు తల్లికి వందనం నగదు జమచేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. అనంతరం పనితీరులో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాలను, స్టాల్స్‌ను మంత్రి తిలకించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులు టీసీ రాజన్‌ను సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, థామస్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్‌వో మోహన్ కుమార్, డీఎఫ్‌వో భరణి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఆర్డీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

5 రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం

స్త్రీ శక్తి పథకం పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కార్యక్రమం ప్రారంభించుకున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పాలనలో బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ప్రతి సోమవారం మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. కడా ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలో ఏబీఐఎస్, ప్రోటిన్, మదర్ డెయిరీ వంటి పరిశ్రమలు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ఇంకా 14 పరిశ్రమలు స్థాపన దశలో ఉన్నాయని, జిల్లాలో సర్వేలో గుర్తించిన 42,852 మంది నిరుపేదలను 3640 మంది మార్గదర్శకులతో ప్రత్యక్షంగా దత్తత తీసుకుని సహాయం చేసే పీ-4 విధానం అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు.







వ్యవసాయ శాఖ ప్రదర్శించిన శకటం, కళారిపట్టు నృత్యం చేస్తున్న వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జయచంద్ర అకాడమీ, విన్యాసాల్లో పాల్గొన్న పోలీస్ జాగిలాలు

సుబ్రమణ్య స్వామికి పట్టువస్త్రాల సమర్పణ



సదుం: పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

సదుం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భరణి కావళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. శనివారం ఆడికృత్తిక సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతమ్మ ఆలయం వద్దకు చేరుకుని స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు తాటిగుంటపాలెంలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణ, నారాయణరెడ్డి, పుత్రాజు, ఇమ్రాన్, కల్యాణ భరత్, అంజిబాబు, వెంకటస్వామి, మోహన్ రెడ్డి, దామోదర రెడ్డి, గిరిధర్ రెడ్డి, ఎల్లారెడ్డి, హనుమంత రెడ్డి, వాసు, బాబు, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాటిగుంటపాలెంలో పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, కుటుంబ సభ్యులు

ఎంపీకి బెయిల్ రావాలని పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్, జ్ఞానజగదీష్



కాణిపాకంలో మొక్కు తీర్చుకున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్, చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికు బెయిల్ రావాలని వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో చిత్తూరు–కాణిపాకం వరకు పాదయాత్ర నిర్వహించారు. శుక్రవారం స్థానిక దొడ్డిపల్లెలోని సప్తకనికలమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ర్యాలీని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జ్ఞానజగదీష్, ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో సాగుతోందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయనకు త్వరగా బెయిల్ రావాలని అమ్మవారిని ప్రార్థించి కాణిపాకం వరకు ర్యాలీ నిర్వహించామన్నారు. చేయని తప్పుకు ఎంపీని జైలులో పెట్టడం ఎంత వరకు న్యాయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాణిపాకంలో స్వామివారిని దర్శించుకొని ప్రార్థనాలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గుడిపాల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, చిత్తూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ బాబునాయుడు, నాయకులు, ప్రజాప్రతినిధులు హరీషారెడ్డి, ప్రతిమారెడ్డి, మధురెడ్డి, శివ,మనోజ్‌రెడ్డి, అన్బు, మధుసూదన్, త్యాగ, అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, అప్పాజీ, భాను, స్టాండ్లీ, శేఖర్, లోక, చంద్ర, చామంతి, జస్టిన్, శ్యామ్, సద్దాం, రవి, మహేష్, చిన్నా, ట్వింకిల్, శివారెడ్డి, సెల్వ, విజయ్ పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి విడుదల కావాలని దర్గాలో ప్రార్థనలు

చౌడేపల్లె : అక్రమ కేసులో కుట్ర పూరితంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని జైలుకు పంపారని త్వరగా బెయిల్ ఇవ్వడంతో పాటు అక్రమ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకురావాలని దాదేపల్లెలోని మషాయక్ బహదూర్ అలీషాబాబా దర్గాలో దుర్గసముద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం దర్గాలో బాబా మజ్జార్‌కు చాదర్‌ను కప్పి గంధం, పూలు సమర్పించి మత పెద్దల చేత ప్రత్యేక ప్రార్థనలు , దువ్వా చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానుకొని వారికి మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరమణ, అమర, కోఆప్షన్ మెంబర్ సాధిక్, రమేష్‌బాబు, ఉపసర్పంచ్‌లు కృష్ణంరాజు, అల్తాఫ్, వైఎస్సార్‌సీపీనేతలు సుబ్రమణ్యం రాజు, అల్తాఫ్,రెడ్డిభాషా, అనీష్ తదితరులున్నారు.



బహదూర్ అలీషా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీనేతలు

క్లుప్తంగా

విధుల్లోకి చేరిన ఎస్పీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు శనివారం విధులకు హాజరయ్యారు. గతవారం వ్యక్తిగత పనులపై ఎస్పీ విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ పనులు ముగించుకుని తిరిగి విధులకు హాజరయ్యారు. తర్వాత పోలీసు అధికారులతో సమీక్ష చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పరువు హత్య కేసులో తల్లి అరెస్టు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని యాస్మిన్ అనే వివాహిత హత్య కేసులో ఆమె తల్లి ముంతాజ్‌ను శుక్రవారం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. షౌకత్ అలీ ముంతాజ్ దంపతుల కుమార్తె యాస్మిన్ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా యాస్మిన్ కులాంతర వివాహం చేసుకోవడంతో జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు తమ పరువు పోయిందని భావించి యాస్మిన్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. మృతురాలి తండ్రితో పాటు మరో ఇద్దరు కుటుంబ సభ్యులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా మృతురాలి తల్లిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరపరచగా.. ఆమెను జడ్జి ఆదేశాలతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

జాతకం కుదరలేదని గెంటేసిన ప్రియుడు

- ఇంటి ముందు ధర్నాకు దిగిన ప్రియురాలు
- పోలీసుల హామీతో ధర్నా విరమణ

చిత్తూరు అర్బన్ : జాతకం కుదరలేదని ప్రియురాలిని ఇంటి నుంచి గెంటేసిన ప్రియుడి ఘటన శుక్రవారం చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. చిత్తూరు నగరం 8 వార్డులోని శ్రీనివాసనగర్‌కు చెందిన ప్రేమికులకు పోలీస్ స్టేషన్‌లో ఇటీవలే కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో ప్రియుడు ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని ఇంటికి తీసుకెళ్లాడు. తీరా ఏమైందో ఏమో కానీ జాతకాలు కలవలేదని ప్రియురాలిని శుక్రవారం ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో ప్రియురాలు.. ప్రియుడు ఇంటి ముందు ధర్నా చేసింది. ఇందుకు గ్రామస్తులు మద్దతు ఇచ్చారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రియురాలు ధర్నాను విరమించుకుంది.

విశిష్ట సేవలకు పురస్కారాలు

- వివిధ శాఖల్లో 319 మందికి ప్రశంసాపత్రాలు
- అందజేసిన మంత్రి సత్యకుమార్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో విధుల పట్ల ప్రతిభ చూపిన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి అవార్డులు వరించాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారు నెలకొల్పిన విప్లవాత్మకమైన గ్రామ సచివాలయాల ఏర్పాటు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ సత్ఫలితాలను ఇస్తున్నాయి. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ కేడర్ సచివాలయ ఉద్యోగుల విశిష్ట సేవలకు గాను అవార్డులు అందుకోవడం విశేషం. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ విశిష్ట సేవలందించిన 21 మంది అవార్డులు స్వీకరించారు. అదే విధంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న 319 మందికి అవార్డులు అందించారు. వేడుకల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు అందజేసిన ప్రశంసాపత్రాల్లో కొత్త పద్ధతి అవార్డు గ్రహీతల ఫొటోలను ముద్రించి అందజేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.


స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు పురస్కారం అందుకుంటున్న కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎస్పీ, అధికారులు


యుగంధర్‌రెడ్డి, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్; సమీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్; బేబిరాణి, ఏఎన్ఎం; జ్యోష్న, అగ్రికల్చర్ అసిస్టెంట్; ఈశ్వర్, హార్టికల్చర్ అసిస్టెంట్; హరికృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్; మురళీకృష్ణ, వార్డ్ అడ్మిన్ సెక్రటరీ; మనోజ్, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ; ముజమ్మిల్, వార్డ్ అమినిటీ సెక్రటరీ; ఇమ్రాన్ ఖాన్, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ; త్యాగరాజు, వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ; పద్మనాభన్, వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ


గౌరి, జిల్లా టూరిజం అధికారి; జయరాజ్, జిల్లా సర్వే శాఖ అధికారి; వాసుదేవన్, కలెక్టరేట్, ఏవో; బ్యూలా, సూపరింటెండెంట్, కలెక్టరేట్; జయప్రకాష్, కలెక్టర్ సీసీ; రాజశేఖర్ రాజు, ఏఎస్పీ, ఆపరేషన్స్; పార్థసారథి, డీఎస్పీ, కుప్పం; చిన్నికృష్ణ, ఏఆర్, డీఎస్పీ, చిత్తూరు; కరిష్మ సిమ్రన్, విలేజ్ సర్వేయర్; భార్గవి, మహిళాపోలీస్; కోదండపాణి, వార్డు రెవెన్యూ సెక్రటరీ; తేజ, పంచాయతీ సెక్రటరీ; రామచంద్రన్, డిజిటల్ అసిస్టెంట్; చంద్రశేఖర్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్; రిహాన, మహిళా పోలీస్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం డీఈఓ విలేకరులతో మాట్లాడారు. 2025వ సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవార్డులకు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10 సంవత్సరాల సర్వీసు ఉన్న హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు జిల్లా స్థాయి అవార్డులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు తమ ప్రతిపాదనల దరఖాస్తులు రెండు కాపీలు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత డీవైఈవో కార్యాలయాల్లో అందజేయాలన్నారు. గడువు తర్వాత వచ్చే దరఖాస్తుల ప్రతిపాదనలు స్వీకరించబడవని డీఈవో వెల్లడించారు.

మూడు హోటళ్లు సీజ్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో స్వాతంత్య్ర దినోత్సవ నిబంధనలు ఉల్లంఘించి మాంసాహార భోజనాలు విక్రయిస్తున్న హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం నగరంలోని పలమనేర్ రోడ్డు లోని హోటల్ తో పాటు మరో రెండు హోటళ్లలో మాంసాహారం విక్రయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు ఫిర్యాదులు అందాయి. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య శాఖ అధికారులు నగరంలోని మూడు హోటళ్లను సీజ్ చేశారు.

కావళ్ల ఉత్సవం

గుడిపాల : హరోం హర నామాలతో గ్రామాలు హోరెత్తాయి. శుక్రవారం భరణి కావళ్లు రావడంతో ఉదయం నుంచి భక్తులు ఉపవాసాలతో సుబ్రమణ్యస్వామికి పూజలు చేసి కావడి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా బసవాపల్లె, ముత్తువాళ్లూరు, గుడిపాల, ముట్టుకూరుపల్లె, పాపసముద్రం, అడవిచేను గ్రామంలో కావళ్లను ఎత్తారు. గుడిపాల మండలంలోని కందగిరి సుబ్రమణ్యస్వామి, వళ్లిమలైకి కావళ్లతో మొక్కులు తీర్చుకున్నారు.


అలంకరణలో సుబ్రమణ్యస్వామి


పల్లూరులో భరణి కావళ్లతో ఊరేగింపు

నేటి నుంచి రాజనాలబండ జాతర

చౌడేపల్లె : సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీ లక్ష్మినరసింహస్వామి ,శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నేటి నుంచి రెండు రోజులపాటు వైభవంగా జాతర జరగనుంది. టీటీడీ ఆధ్వర్యంలో సంప్రదాయ రీతిలో తిరుణాల జరగనుందన్నారు. ఏటా పూర్వీకుల నుంచి శ్రావణమాస చివరి శనివారం రోజున రాజనాలబండపై వెలసిన స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పక్కనే ఉన్న ఎత్తైన శ్రీలక్ష్మినరసింహస్వామి కొండపై భక్తులు తరలివెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ. అదే రోజు రాత్రి కొండపై గల రాతి స్తంభంపై దీపం వెలిగించి అఖండ దీపారాధన చేస్తారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగింపు చేపడుతారు. ఆదివారం రోజున కోలాహలంగా తిరుణాల నిర్వహిస్తారు. రాజనాలబండకు సమీపంలోని మొత్తం 18 గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకొంటారు.కొలింపల్లె నుంచి గ్రామదేవత బోయకొండ గంగమ్మ తల్లి ఉత్సవమూర్తితో కలిసి ఊరేగింపుగా చేరుకొని బండారు పంపకం చేసిన అనంతరం సంప్రదాయ రీతిలో దేవరెద్దులు, బోయకొండ అమ్మవారిని రాజనాలబండకు చేర్చుతారు. వేల మంది భక్తులు వీరాంజనేయస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. అక్కడి నుంచి ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ మేరకు టీటీడీ విజిలెన్స్ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


రాజనాలబండ ఆలయం వద్ద ఏర్పాట్లు చేసిన దృశ్యం

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 66,530 మంది స్వామివారిని దర్శించుకోగా 32,478 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

జేసీబీ తరలిస్తుండగా విద్యుదాఘాతం



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు, జేసీబీని తరలిస్తున్న టెంపో

– డ్రైవర్ మృత్యువాత

చౌడేపల్లె : టెంపోలో జేసీబీని తరలిస్తుండగా విద్యుదాఘాతంతో జేసీబీ డ్రైవర్ సుబ్రమణ్యంరెడ్డి(45) మృతి చెందిన ఘటన శుక్రవారం కొలింపల్లె వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. పుంగనూరు మండలం ఎల్లారుబైలు నుంచి జేసీబీని టెంపోలో కొలింపల్లె మీదుగా పుంగనూరు వైపునకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామసముద్రం మండలం టి.గొల్లపల్లెకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి టెంపోలో జేసీబీని ఎక్కించి ఆ సీటులోనే అక్కడే కూర్చొని ప్రయాణిస్తుండగా కొలింపల్లె సమీపంలోని ఒడ్డోనితోట సమీపంలోకి రాగానే టెంపోలో గల జేసీబీకి విద్యుత్ తీగలు తగులుతాయని టెంపో డ్రైవర్ సుబ్రమణ్యం రెడ్డిని కట్టె సాయంతో పైకి ఎత్తాలని సూచించారు. జేసీబీలో నుంచి దిగేందుకు డోర్ తీయగా విద్యుదాఘాతానికి గురై సుబ్రమణ్యంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో టి.గొల్లపల్లెలో విషాదఛాయలు అలుముకొన్నాయి. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం గల తీరుపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


ప్రమాదంలో మృతిచెందిన సుబ్రమణ్యం రెడ్డి

ఎమ్మెల్సీ మేరిగకు పరామర్శ

రాపూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ను పలువురు పరామర్శించారు. మురళీధర్ తండ్రి మేరిగ ఆనందరావు (89) గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాపూరులోని లక్ష్మీపురంలోని ఆయన నివాసంలో ఆనందరావు భౌతిక కాయాన్ని సందర్శించిన పలువురు నాయకులు మేరిగ మురళీధర్‌ను పలకరించి, సంతాపం తెలిపారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జోన్-4 వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ బొద్దు మధుసూదన్‌రెడ్డి, దందోలు నారాయణరెడ్డి, మస్తాన్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు శుక్రవారం ఆనందరావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మేరిగను పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.


మేరిగ ఆనందరావుకు నివాళులర్పిస్తున్న నారాయణ స్వామి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత


ఆనందరావుకు నివాళులర్పించేందుకు వచ్చిన నేదురుమల్లి, కిలివేటి, ఎల్లసిరి తదితరులు

పండుగకు వచ్చి ..నీట మునిగి చిన్నారి మృత్యువాత


నితీష్‌కుమార్

శాంతిపురం : బంధువుల ఇంట కావడి పండుగ కోసం వచ్చిన నాలుగేళ్ల బాలుడు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. కుప్పం మండలం మోట్లచేను సమీపంలోని బిక్కిలిగట్టు గ్రామానికి చెందిన నితీష్‌కుమార్ (4) తన అమ్మమ్మతో పాటు ఎంకేపురానికి వచ్చాడు. శుక్రవారం బంధువుల ఇంట్లో కావడి పండుగ పూజలు చూసి, భోజనం అనంతరం సాయంత్రం ఇంటి సమీపంలోని చెరువులో ఆడుకునేందుకు మరో ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లాడు. మిగతా పిల్లలు చూస్తుండగానే నితీష్‌కుమార్ నీటిలో పడిపోవడంతో వారు కేకలు వేస్తూ ఇంటికి వచ్చారు. గ్రామస్తులు వెళ్లి నీట మునిగిన బాలుడిని బయటకు తీసి శాంతిపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గ్రామంలో సుబ్రమణ్యస్వామి భక్తులు కావడి పండుగతో ఉన్న కోలాహలం ఆవిరై ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. బిక్కిలిగట్టుకు చెందిన శంకర్, రూపకు ముగ్గురు సంతానం. కుమారుడు నితీష్‌కుమార్(మనోజ్) తర్వాత ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నారి మృతదేహాన్ని కుప్పం మండలంలోని స్వగ్రామానికి తరలించారు.

అరాచకం రాజ్యమేలుతోంది

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన

తిరుపతి మంగళం : స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు అవుతోందని, అయితే రాష్ట్రం స్వాతంత్య్రం కోల్పోయి ఏడాదిన్నర అవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఖండిస్తూ శుక్రవారం తిరుపతి పద్మావతిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా హరించివేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు వాక్ స్వాతంత్య్రాన్ని కోల్పోతున్నామని, ప్రశ్నించే పరిస్థితులు లేకుండా పోతున్నాయని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకం, అవినీతి రాజ్యమేలుతోందని, ప్రశ్నించే వారిపై నిందారోపణలు మోపి, హింసలకు పాల్పడే వారిగా చిత్రీకరించి, కేసులు బనాయించి జైళ్లల్లోకి కుక్కి ప్రజస్వామ్యమనేది లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఏడాదిన్నర కిందట జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు మొత్తం ఈవీఎంలన్నీ ట్యాపరింగ్ చేశారన్న విషయం దేశమే కోడై కూస్తోందన్నారు. ప్రజాస్వామ్యంగా పరిపాలించి రాష్ట్రంలోని పేదల ప్రజలకు సంక్షేమ రూపంలో రూ. 2.50 లక్షల కోట్లను పేద ప్రజలకు అందించిన గొప్ప నాయకుడైన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా వారిని జైళ్లల్లోకి కుక్కే ప్రయత్నాలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. ఈ రాష్ట్రంలో హక్కులు లేవు, భావప్రకటన స్వేచ్ఛ లేదు, ప్రశ్నించే మనుషులకు సంకెళ్లు పడుతున్నాయని ఆరోపించారు. ఈ కూటమి అరాచకాలపై ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 79వ స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్నామే తప్ప రాష్ట్రంలో మాత్రం స్వాతంత్య్రం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం

– ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం మహిళకు ఉచిత బస్సును రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దుగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, మేయర్ అముద ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ఉచిత బస్సును ప్రారంభోత్సవం చేశారు. వీరంతా బస్సులో కాణిపాకం వరకు ప్రయాణం సాగించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

కాణిపాకానికి ఎక్స్‌ప్రెస్ షో..

కాణిపాకానికి ప్రస్తుతం పల్లె వెలుగు సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పల్లె వెలుగు బస్సులే నిత్యం చిత్తూరు- కాణిపాకానికి రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఉచిత బస్సు ప్రారంభోత్సవంలో భాగంగా చిత్తూరు-కాణిపాకానికి ఒక పల్లె వెలుగు బస్సుతో పాటు ఒక ఎక్స్‌ప్రెస్ బండిని నడిపారు. చిత్తూరు బస్టాండులో బస్సు బయలుదేరే క్రమంలో చిత్తూరు-తిరుపతి అనే బోర్డు తీసేసి చిత్తూరు-కాణిపాకం అనే బోర్డు పెట్టారు. దీంతో అక్కడున్న వారంతా ఆ బస్సుపై ఓ లుక్కేశారు. ఇకపై కాణిపాకానికి ఎక్స్‌ప్రెస్ బస్సు కూడా నడుపుతారని ఊహించారు. అయితే ఈ ఎక్స్‌ప్రెస్ బండి కాణిపాకానికి షో మాత్రమేనని పలువురు విమర్శలు చేశారు.


బస్సు ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్

బోయకొండలో రాహుకాల పూజలు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా గంగమ్మకు రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం 10:30 గంటల నుంచి 12 గంటల వరకు సంప్రదాయంగా అర్చనలు , అభిషేక పూజలు చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత అన్నప్రసాదం పంపిణీ చేశారు.


ఆలయంలో భక్తుల రద్దీ

పోలీసుల నిర్లక్ష్యంపై ఆందోళన


పుంగనూరు ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న రవితేజ బంధువులు

- బాధితుల ఫిర్యాదుపై పోలీసులు మరోలా కేసు నమోదు
- ప్రభుత్వాసుపత్రి ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన

పుంగనూరు : కన్నబిడ్డ కూలీకెళ్లి మృతి చెందాడని, ట్రాక్టర్ యజమాని నిర్లక్ష్యం , సమాచారం కూడా ఇవ్వలేదని కన్నబిడ్డ మరణంపై చౌడేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీసులు మరోలా కేసు నమోదు చేయడంపై బాధితులు ఆగ్రహించారు. శుక్రవారం పోలీసుల తీరుకు నిరసనగా ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చారాలకు చెందిన రవితేజ (25) ట్రాక్టర్‌లో పొలం మడి దున్నేందుకు వెళ్లి చౌడేపల్లె మండలం దుర్గసముద్రం వద్ద ఈనెల 14న మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లకపోవడంతో పాటు, ప్రమాదం విషయాన్ని మృతుడి కుటుంబీకులకు తెలపలేదని బోరున విలపించారు.108 వాహనంలో కాకుండా ఆటోలో తరలించడంలో ఆలస్యం కావడంతోనే తమ బిడ్డ మృతి చెందాడని ఆరోపించారు. ప్రమాదం జరిగి 24 గంటలు పూర్తి అయినా పోలీసులు పోస్టుమార్టం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనపై ట్రాక్టర్ యజమానిని అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని, పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు కాకుండా మరోలా వారికి నచ్చినట్లు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని అందజేయడం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. పోలీసులు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి బాధితులకు న్యాయం చేయకుండా అన్యాయం చేయడం తగదని రోడ్డెక్కారు. విషయం తెలుసుకొన్న చౌడేపల్లె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని , ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కాగా చౌడేపల్లె పోలీసులపై పలు ఆరోపణలు చేశారు.